
# బెస్ట్ ఫ్రెండ్

కథ



గుడిపాటి

"ఏమిటీ తల్లీకూతుళ్ళిద్దరూ మూగనోము పట్టారు" భోజనం చేస్తూ అడిగాడు సురేష్.

భార్య శ్రావణిగానీ, కూతురు ఇందూ గానీ ఏం మాట్లాడలేదు.

ఇందూ పొద్దుటే ఎనిమిది గంటలకు స్కూల్‌కు వెళుతుంది. తర్వాత తామిద్దరూ తొమ్మిది గంటలకే ఆఫీసుకెళతారు. పొద్దునంతా హడావిడి.

కానీ రాత్రి ఎనిమిదిన్నరకి డైనింగ్ టేబుల్ దగ్గర ముగ్గురు కలిసి కబుర్లు చెప్పుకుంటూ భోంచేయడం అలవాటు. కొడుకు ఎంసెట్ లాంగ్‌టర్మ్ కోచింగ్‌కి విజయవాడ హాస్టల్‌లో చేరడంతో ఇప్పుడు ముగ్గురే ఉంటున్నారు. అయినా ఎప్పుడూ ఏదో ఒకటి మాట్లాడటం ఇందుకి అలవాటు.

"ఇందూ... ఎనీ ప్రాబ్లమ్"

"ఏం లేదు డాడీ..."

"మరేం మాట్లాడవేం"

"రోజూ ఏముంటాయి డాడీ మాట్లాడటానికి"

"ఏం లేకున్నా ఏదో ఒకటి చెబుతుంటావు కదా... ఈ రోజు ఏమైంది"

కాస్సేపు మౌనం.

శ్రావణి వైపు చూశాడు.

తన ముఖంలో ఏదో దిగులు. ఏదో తిన్నట్టు చేస్తోంది గానీ ఆమెకు తిండి సయించడం లేదని అర్థమైంది.

"తల్లీకూతుళ్ళిదరూ ఏమైనా పోట్లాడుకున్నారా ఏంటీ... ఎనీ థింగ్ రాంగ్."

"భలేవాడివి డాడీ..." అంటూ నవ్వేసింది ఇందూ.

"హమ్మయ్య... నువ్వు నవ్వావు అది చాలు తల్లీ నాకు" అంటూ తనూ నవ్వాడు.

మౌనంగా ఉండిపోయిన శ్రావణిని చూస్తూ "మీ అమ్మ మాత్రం నోరు విప్పలేదు" అన్నాడు.

"ముందు మీరు భోంచేయండి" అంది ముక్తసరిగా.

ఆమె మూడ్ ఎందుకో బావో లేదనుకున్నాడు.

భోజనం ముగించాక ఇందూ 'గుడ్‌నైట్' చెప్పి తన గదిలోకి వెళ్ళిపోయింది.

సురేష్ గదిలో పుస్తకం పట్టుకుని కూర్చున్నాడు. పేజీలు తిరగేస్తున్నాడే గానీ శ్రావణిని డిస్టర్బ్ చేసిన విషయం ఏమై ఉంటుందోనని ఆలోచిస్తున్నాడు.

ఆమె గదిలోకి వచ్చింది. బెడ్ మీద కూర్చుందే గానీ ఏం మాట్లాడ లేదు.

ఆమెకు దగ్గరగా జరిగి కూర్చున్నాడు.

"ఏమిటీ శ్రావణి ఎందుకలా వున్నావు?"

ఏం మాట్లాడలేకపోయింది. కళ్ళలో నీళ్ళు.

సురేష్ చలించిపోయాడు.

"అరె... ఏడుస్తున్నావా? ఏం జరిగిందిరా.." అంటూ దగ్గరకు తీసుకున్నాడు.

ఆమెకు అప్పటిదాకా ఆపుకున్న దుఃఖం ఆగలేదు.

సురేష్ కంగారు పడ్డాడు. భార్య చెంపల మీద కారుతున్న కన్నీళ్ళు తుడుస్తూ "ఎందుకురా కన్నా అంత బాధ... అసలేమైంది చెప్పు" అంటున్న ఆ గొంతులోని ఓదార్పు, లాలన శ్రావణిని మరింత విచలితురాలిని చేసింది.

"నువ్వు బెంగపడితే తట్టుకోలేనురా... ఎందు కంత దిగులు? ఏమైందిరా" అంటూ ఆమెని దగ్గరగా హత్తుకున్నాడు.

ఈ ప్రేమ కోసమే కదా తను అల్లాడింది. ఈ ఆప్యాయత కోసమే కదా తను తనదైన జీవితాన్ని ఎంచుకుంది.

"సురేష్... ఎలా చెప్పాలో అర్థం కావడం లేదు... చెబితే నువ్వు ఎంత బాధపడతావో..." దుఃఖంతో గొంతు పూడుకుపోయింది.

"నువ్వు దిగులుగా ఉంటేనే బాధ తప్ప మరే విషయానికి బాధపడనని నీకు తెలుసు శ్రావణీ"

ఈ సెన్సిబిలిటీనే తనకు నచ్చింది.

తనని తాను సంబాళించుకునేందుకు ప్రయత్నించింది.

ఆ సాయంత్రం కూతురితో జరిగిన సంభాషణ గుర్తుకొచ్చింది.

** ** **

"ఇందూ... నీ బర్త్‌డే ప్రజెంటేషన్‌గా ఈ సారి నీకు మంచి పట్టు పరికిణీ కొందామనుకుంటున్నా... ఏమంటావు" హోంవర్క్ చేస్తున్న కూతురు పక్కన కూర్చుని అడిగింది శ్రావణి.

"వద్దు మమ్మీ" ముభావంగా అంది.

"అదేమిటా అలా అంటావు... ఎప్పుడూ స్కూల్ డ్రెస్సులేనా లంగా ఓణీ వేసుకుంటానని మారాం చేస్తుంటావు కదా" అంటూ విస్తుపోయింది.

ఇందూ ఏం మాట్లాడలేదు.

"మరేం కావాలో చెప్పు"

అయినా నోరు విప్పలేదు.

"జీన్స్ కావాలా... గాగ్రాచోళీ కావాలా... స్కర్ట్ కావాలా... చెప్పమ్మా" అనునయంగా తన చుట్టూ చేతులు వేసి దగ్గరికి తీసుకుంటూ అడిగింది శ్రావణి.

నోట్స్ మీద పెన్ను పెట్టి తల్లి వైపు తిరిగి కళ్ళలోకి చూసింది.

ఏం మాట్లాడలేదు.

"ఏంటే ఆ చూపులు... నీ పదిహేనో పుట్టినరోజు ఎంత ఘనంగా సెలబ్రేట్ చేసుకోవాలనుకున్నావు... సమ్మర్ హాలీడేస్ ముందు నుంచి చెబుతూ వచ్చావు. టూర్‌లో కూడా డాడీతో అలాచేయాలి... ఇలా చేయాలి అన్నావు...చెప్పమ్మా నీకేం కావాలి... ఎలాంటి డ్రెస్ కావాలి. పోనీ గోల్డ్ చైన్ కావాలా... చెప్పు... నువ్వు ఈ ఇయర్ టెన్త్‌లో మంచి ర్యాంకు తెచ్చుకుంటే కొనిద్దామనుకున్నా...ఈ బర్త్‌డేకి కొనిమ్మంటావా, చెప్పమ్మా"


"నాకు కావాల్సింది అవన్నీ కాదు మమ్మీ"

"మరేం కావాలో చెప్పు"

కొన్ని క్షణాలు ఆగింది ఇందూ.

"వద్దులే మమ్మీ..." అంటూ ఆగిపోయింది.

పాప వైపు విస్తుపోతూ చూసింది శ్రావణి.




"అదేమిటే, నువ్వు అడిగింది ఎప్పుడైనా కాదన్నానా? అసలు నీకు ఏం కావాలో చెప్పు"

తల్లి కళ్ళలోకి చూస్తూ "నాన్న కావాలి" అంది.

"ఓస్ అంతేనా... నీ బర్త్‌డే నాడు డాడీ ఉంటాడో, క్యాంపుకు వెళ్తాడోనని బెంగపడుతున్నావా? ఆ రోజు ఆఫీసుకి సెలవు పెట్టి ఇంట్లోనే ఉండమని చెబుతానులే..."

తల్లి మాట పూర్తి చేయకముందే "మమ్మీ.. నేను అడుగుతున్నది నాన్న గురించి" అంది.

"మరి నేను చెబుతున్నదేమిటే"కూతురి వాలకం విచిత్రంగా తోచింది శ్రావణికి.

"ఈ డాడీ గురించి కాదు... నా నాన్న గురించి..." వత్తి పలుకుతూ అంది ఇందూ.

"అంటే..." కూతురు అంటున్నదేమిటో అర్థమయి విస్తుపోయింది.

"ఈ బర్త్‌డేని అమ్మ, నాన్నలతో సెలబ్రేట్ చేసుకోవాలనుంది నాకు... అందుకే ఈ బర్త్‌డేకి నాన్న ఉండాలి."

ఆ మాటతో శ్రావణి మ్రాన్పడిపోయింది. కూతురు అడుగుతున్నదేమిటో అర్థమయ్యేసరికి తల తిరిగిపోయింది. కొన్ని క్షణాలు పాటు ఏం మాట్లాడలేకపోయింది.

కూతురి వైపే చూస్తుండిపోయింది. ఏం తక్కువ చేశామని తనకు నాన్న గుర్తొచ్చాడని అల్లాడిపోయింది.

"మాట్లాడవేం మమ్మీ..." తల్లి కళ్ళలోకి నేరుగా చూస్తూ అడిగింది ఇందూ.

"నువ్వు ఏం మాట్లాడుతున్నావో తెలిసే మాట్లాడుతున్నావా ఇందూ"

"నేను ఏమైనా తప్పుగా మాట్లాడానా మమ్మీ?"

ఆ ప్రశ్నకు జవాబు చెప్పలేకపోయింది.

మనసంతా రకరకాల ఆలోచనలు.

"ఎప్పుడూ లేనిది ఇలా మాట్లాడుతున్నావేం ఇందూ... డాడీ వింటే ఏమనుకుంటారు. తను నిన్ను సరిగా చూసుకోవడం లేదా. నీకు ఏమైనా తక్కువ చేశారా"

"ఈ డాడీ నాకు బెస్ట్ ఫ్రెండ్. కానీ నాన్న నాన్నేకదా మమ్మీ..."

అమాయకంగా అంటున్న కూతురు వైపు చూస్తూ తనేనా ఇలా మాట్లాడుతున్నదనుకుంది.

"నువ్వేం చిన్నపిల్లవి కాదు ఇందూ, నీకు అన్నీ తెలుసు"

"తెలుసు మమ్మీ... నా బర్త్‌డేకి ఎక్కడెక్కడో ఉన్న అమ్మమ్మ, తాతయ్య, అత్తయ్య, పిన్ని, బాబాయిలు అందరూ వస్తారు. హాస్టల్‌లో ఉంటున్న అన్నయ్య కూడా వస్తాడని చెప్పావు.సిటీలో ఉన్న నాన్న కూడా వస్తే బావుంటుంది మమ్మీ"

కూతురి మాటలకు నిరుత్తరాలయింది శ్రావణి. ఏం చెప్పాలో తోచలేదు.

మౌనంగా ఉన్న తల్లిని చూస్తూ "నీకు ఇష్టమైతేనే మమ్మీ... నువ్వు ఒప్పుకుంటేనే నాన్నని రమ్మని చెబుతా..." అంటూ పుస్తకాల బ్యాగ్ సర్దుకుని తన గదిలోకి వెళ్ళిపోయింది ఇందూ.

కూతురు తనకు దూరమయిపోతున్నట్టుగా తోచింది. ఏదయితే జరగకూడదో అదే జరగబోతున్నట్టుగా తోచి కలవరపడింది.

** ** **

విషయమంతా విన్న సురేష్ కొన్ని క్షణాల పాటు మౌనంగా ఉండిపోయాడు. వెంటనే ఏం చెప్పాలో తోచలేదు. శ్రావణిని తను ప్రేమించాడు. ఆమెతోపాటు ఆమె పిల్లల్ని కూడా తన జీవితంలో భాగంగా భావించాడు.

శ్రావణినే మళ్ళీ నోరు విప్పింది. "పిల్లల మీద అతడి నీడ పడకూడదనుకున్నా. అతడి ప్రభావం ఉండ కూడదనుకున్నా... ఇప్పుడు ఇందూ ఏకంగా అతణ్ణి బర్త్‌డేకి పిలవాలంటుంది... మన గురించి ఏమాత్రం

ఆలోచించడం లేదు"

"..."

"అయినా నువ్వు ఏం తక్కువ చేశావు సురేష్, నీ పిల్లలు కాకున్నా నీ పిల్లల్లాగా చూసుకున్నావు..."


"ప్లీజ్ శ్రావణీ... అలా మాట్లాడకు, 'నీ నా' అనే అభిప్రాయాలకు నా మనసులో చోటు లేదు. వాళ్ళు మన పిల్లలనే అనుకున్నాను. ఇద్దరం అలాగే అనుకున్నాం... అలానే పెంచాం..."

"అదే నేను అంటున్నది... కానీ ఇప్పుడు ఇందూ 'నా నాన్న కావాలి' అంటుందంటే ఏమనాలి? మనమేం లోపం చేశాం? ఏం తక్కువ చేశాం తనకు?"

ఆమె స్వరంలో దుఃఖపు జీర.

"తనే ఏదో మెస్మరైజ్ చేసి ఉంటాడు.తనే ఇలా కావాలని చేసి ఉంటాడేమో..." అనుమానం వెలిబుచ్చింది.

"డోంట్ బి సిల్లీ శ్రావణీ...వీళ్ళేం చిన్నపిల్లలు కాదు"



సమ్మర్ హాలీడేస్‌లో పిల్లలు ఇద్దరూ వారం రోజులు వాళ్ళ నాన్న దగ్గరుండి వచ్చారు. ఆ వారం రోజులు శ్రావణి ఎంతగా తల్లడిల్లిందో సురేష్‌కి తెలుసు. మూడేళ్ళ తర్వాత అతను తిరిగి సిటీకి వచ్చాడు. ఫోను చేశాడు. శ్రావణితో విడిపోయిన రోజుల్లో పిల్లల కోసం అతడు కోర్టుకు ఎక్కడం సెలవుల్లో కొన్నాళ్ళపాటు పిల్లల్ని అతని దగ్గరికి పంపాలని కోర్టు తీర్పు ఇవ్వడం, ఆ తర్వాత అప్పుడప్పుడు పిల్లలు వెళ్ళివస్తున్నా తమతోనే ఉన్నారు.ఆ తర్వాత అతను ఉద్యోగ రీత్యా కొన్నాళ్ళపాటు దూరంగా వెళ్ళి పోయాడు. కానీ అప్పుడప్పుడు పిల్లల స్కూళ్ళ దగ్గరకు వచ్చి కలిసి వెళ్ళిపోవటం తెలుసు. ఈ ఏడాది తిరిగి వచ్చాడు. పిల్లలతో ఫోనులో మాట్లాడాడు. పిలిచాడు. వెళ్ళారు.

ఇవ్వన్నీ ఇద్దరికీ తెలుసు. అయినా అతడు తనకు పిల్లల్ని దూరం చేస్తాడని శ్రావణి భయపడుతుండేది. కానీ ఆ భయం అక్కర్లేదని సురేష్ చెప్పేవాడు. తాము కొత్త జీవితాన్ని ఆరంభించిన రోజుల్లో వాళ్ళ నాన్నకు వ్యతిరేకంగా శ్రావణి మాట్లాడినప్పుడు సురేష్ వారించాడు. పిల్లల మీద తన అభిప్రాయాల్ని రుద్దవద్దని చెప్పాడు. వాళ్ళ నాన్న గురించి పిల్లల దగ్గర ఎప్పుడూ చెడుగా ఒక్కమాట అనకూడదనుకున్నారు. అయినా తల్లిగా శ్రావణి ఆరాటపడుతుంది. పిల్లలు వాళ్ళ నాన్న దగ్గరికి వెళ్ళిన ప్రతిసారి తనలో కలవరం, ఆందోళన... తిరిగివచ్చేవరకు స్థిమితంగా ఉండేది కాదు.

"ఇందూ ఇంకా చిన్నపిల్ల కాదురా శ్రావణీ..."

ఆ మాటల్లో నిజాన్ని అంగీకరించాలన్న సూచన ఉంది.

"చిన్నపిల్ల కాదు... కానీ తను తెలిసే ఎందుకలా అడుగుతుంది"శ్రావణి గొంతులో దిగులు.

"కానీ మనం ఇందూ తరపున కూడా ఆలోచించాలి"

ఆశ్చర్యంగా చూసింది సురేష్ వైపు.

"వాళ్ళ నాన్న బాగా చూసుకుంటాడనే అభిప్రాయం ఉంది తనకి. నిజం కావచ్చు కూడా. అలా లేకుంటే పిల్లలు అతని దగ్గరికి మళ్ళీ మళ్ళీ వెళ్ళేవాళ్ళా ఆలోచించు. ఎన్నడూ వాళ్ళ నాన్న గురించి చెడుగా ఒక్కమాట మాట్లాడలేదు.ఇష్టంగా చూసుకునేవాడని ఇందూ చెబుతుండేది...మొన్న 'బ్లాక్ సినిమాచూస్తూ వాళ్ళ నాన్న కన్నీళ్ళు పెట్టుకున్న విషయం నాకు చెప్పింది నీకు ఆ విషయాలేవీ తెలియదు... ఇందూ అన్నట్టు తనకు నేను బెస్ట్ ఫ్రెండ్‌ని... కాబట్టే కబుర్లు ఎన్నో నాతో కలబోసుకుంటుంది"

"అదంతా అతడి నాటకం... పిల్లల్ని ఎప్పటికయినా మన నుంచి దూరం చేయాలనే ప్రయత్నం" శ్రావణి గొంతులో నిష్కర్ష.

"ఇంకానా... పదేళ్ళ తర్వాత కూడ అతనిలో ఆ కక్ష ఉంటుందంటావా? తనతో నీకు చేదు అనుభవాలు ఉన్నాయి... ప్రేమ రాహిత్యం ఉంది... భర్తగా దురుసుగా వ్యవహరించాడు. కానీ అతడే తండ్రిగా పిల్లలతో సౌమ్యుడుగా ఉండొచ్చు. అలా నటించడం కాదు సహజంగానే తన పిల్లలనే భావం వల్ల మగవాడు అలా ప్రవర్తిస్తాడు..."

అతడి వివరణను మధ్యలోనే ఆపేస్తూ

"మహానుభావా చాల్చాలు... మీరు జియాలజిస్టు అయ్యారుగానీ సైకాలజిస్టు కావాల్సింది" అంటూ నవ్వేసింది శ్రావణి.

"నువ్వు ఇలా నవ్వితే చాలురా నాకు ఇంకేం అక్కర్లేదు" అంటూ దగ్గరకు తీసుకున్నాడు.

అతడి స్పర్శ, మాటలు ఆమె మనసుని తేలికపరిచాయి. కానీ ఈ సమస్యకి పరిష్కారమేమిటో తోచలేదు. అయినా తను ఏమనుకుంటున్నాడో చెప్పలేదు అనుకుంది. విషయాన్ని విశ్లేషించడం వేరు కానీ తన మనసులో బాధ లేదా అనుకుంది.

అదే విషయాన్ని అడిగింది.

"నిజంగానే బాధ లేదు శ్రావణీ... ఎందుకంటే వాస్తవాన్ని అంగీకరించాలి. నేను పిల్లల్ని తండ్రి కన్నా ఎక్కువగా చూసుకోవచ్చు. కానీ తండ్రి అతడనే నిజం నిజం కాకుండా పోతుందా?"

"నిజం ఎలా ఉన్నా ఇందూని మూడేళ్ళప్పట్నించి మీరు ఎంత ప్రేమగా పెంచారు. ఎంత ముద్దుగా చూసుకున్నారు. అయినా ఆ నాన్న కావాలని తను అంటుందంటే అంతా మర్చిపోయిందో, మాయలో పడిపోయిందో అర్థం కావడం లేదు"

"అమాయకంగా మాట్లాడకు శ్రావణీ... పిల్లలు దేన్నీ త్వరగా మరిచిపోరు. నేను తన బెస్ట్ ఫ్రెండనని తనే చెప్పిందన్నావు కదా... అంతకన్నా నాకు వేరే కాంప్లిమెంట్ ఏం కావాలి... ఇక వాళ్ళ నాన్న అంటావా? చెప్పాను కదా పిల్లలతో ఉన్నంత సేపు తను ఇష్టంగా ఉండటం సహజమని. ప్రేమ చూపే వాళ్ళ పట్ల పిల్లలకు ప్రేమ కలగటం సహజం శ్రావణీ"

"నీ మాటలు వింటుంటే నిజంగానే వాళ్ళ నాన్నని రమ్మని చెప్పేట్టున్నావే" అంది నవ్వుతూ.

"నిజమే... నిజంగానే తనని పిలవమని చెబుదాం శ్రావణీ..."

"ఆర్ యు మ్యాడ్ సురేష్... ఏం మాట్లాడుతున్నావు... తను ఈ ఇంటికి రావడమా? అతడి ముందు మన పాప బర్త్‌డే జరపడమా?"

శ్రావణి మాటల్లో కోపం, ఉక్రోషం.

ఆమె ముఖంలో మారుతున్న రంగుల్నీ చూస్తుండిపోయాడు.

"ఎంత ఎంబ్రాసింగ్‌గా ఉంటుందో ఆలోచించావా"

"మనకి ఇందూ సంతోషం ముఖ్యం. తనని చిన్నబుచ్చడం మంచిది కాదు... మన ఇంటికి వచ్చే వాళ్ళెవరితోనయినా ఫ్రెండ్లీగా మాట్లాడి పంపిస్తాం. అతణ్ణి ఒక ఫ్రెండ్‌గా రిసీవ్ చేసుకుందాం..." అంటున్న సురేష్ వైపు చూస్తుండిపోయింది.

అతడి స్పర్శ, మాటలు ఆమె మనసుని తేలికపరిచాయి. కానీ ఈ సమస్యకి పరిష్కారమేమిటో తోచలేదు. అయినా తను ఏమనుకుంటున్నాడో చెప్పలేదు అనుకుంది. విషయాన్ని విశ్లేషించడం వేరు కానీ తన మనసులో బాధ లేదా అనుకుంది. అదే విషయాన్ని అడిగింది.

మరో మనిషి బాధపడకూడదన్న అతడి తపన ముగ్ధురాల్ని చేసింది.ఈ సెన్సిబులిటీకే, ఈ ప్రేమకే తను పడిపోయిందనిపించింది మరోసారి.

"మన ఆరాటమంతా పిల్లల కోసమే కదా... బర్త్‌డే నాడు పాప సంతోషంగా ఉండటం కన్నా మనకేం కావాలి చెప్పు..." అంటున్న సురేష్ మెడ చుట్టూ చేతులు వేసి దగ్గరికి లాక్కుంటూ "యూ ఆర్ గ్రేట్ రా" అంది.

"నా ఆరోగ్యం సహకరించాలే గానీ... ఇప్పటికైనా నీకో పిల్లాణ్ణి కనివ్వాలనుందిరా" అంది దగ్గరగా హత్తుకుపోతూ.

"నాకు ఉన్న ముగ్గురు పిల్లలు చాలురా... ఇంక వేరే వాళ్ళెందుకు" మురిపెంగా అంటున్న అతడి ముక్కు పట్టుకుని "ముగ్గురా" అంది.

"వాళ్ళిద్దరూ పెద్దవాళ్ళవుతున్న పిల్లలు...నువ్వు ఎప్పుడూ నాకు చిన్న పిల్లవే" అంటూ నుదిటి మీద ముద్దు పెట్టాడు.

గలగల నవ్వింది శ్రావణి.

అప్పటివరకు ఉన్న దిగులు, బెంగ కరిగిపోయాయి.

ఆ మరునాడు సాయంత్రం సురేష్ ఇంటికి వచ్చాక ఇందూని పిలిచాడు. చేతిలో కార్డు పెట్టాడు.

కార్డు మీద "మిష్టర్ మోహనకృష్ణ" అన్న అక్షరాల్ని చూసింది.

నిజమేనా అన్నట్టు ఆశ్చర్యపోతూ డాడీ వైపు తిరిగింది.

కళ్ళతోనే అవునన్నట్టు తలూపాడు.

"థ్యాంక్యూ డాడీ... థ్యాంక్యూ సోమచ్... రియల్లీ యూ ఆర్ మై బెస్ట్ ఫ్రెండ్ డాడీ" అంటూ ఆనందంగా తన గదిలోకి వెళ్ళింది. •